# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన–3 17, నవంబరు, 2014

రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జీతాలు పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఎంత మేరకు పెంచాలని అనే విషయంపై ముఖ్యమంత్రి సోమవారం సచివాలయంలో సమీక్ష జరిపారు. ప్రస్తుతం అందుతున్న జీతాలు, పెంపు ప్రతిపాదనలపై అధికారులతో సమీక్ష జరిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, సిఎంఓ ముఖ్య కార్యదర్శి ఎస్.నర్సింగరావు తదితరులు ఇందులో పాల్గొన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు రూ. 95,000 వరకు జీత భత్యాలు అందుతున్నాయి. అయితే ఈ జీతాలు పెరిగిన ఖర్చులకు అనుగుణంగా లేవని ముఖ్యమంత్రి భావించారు. ప్రజాప్రతినిధులు నిజాయితీగా పనిచేయాలని తాను కోరుతున్నానని, అలాంటప్పుడు వారికి సరిపోయేంత జీతం కూడా ఇవ్వాలని ముఖ్యమంత్రి అన్నారు. ఎమ్మెల్యేలు స్వంత వాహనాలలోనే నియోజకవర్గాలలో తిరగుతున్నారని, అసెంబ్లీకి హాజరవుతున్నారని, వివిధ కమిటీలలో సభ్యులుగా ఉండడం వల్ల పలు సమావేశాలకు హాజరవుతున్నారని, జిల్లా కేంద్రాలల్లో కూడా జరిగే కార్యక్రమాలకు వెళుతున్నారని ముఖ్యమంత్రి చెప్పారు. ఇందుకోసం చాలా ఖర్చు కూడా అవుతుందన్నారు. వీరి జీతాలు పెంచడం అనివార్యమని కూడా చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు రూ. 2 లక్షల వరకు జీతాలు ఇవ్వాలని సమావేశంలో చర్చ జరిగింది. ప్రస్తుతం తెలంగాణలో 120 మంది ఎమ్మెల్యేలు, 40 మంది ఎమ్మెల్సీలు ఉన్నారు. వీరిలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర కాబినెట్ హోదా కలిగిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు 36 మంది వున్నారు. మిగిలిన 124 మందికి నెలకు 2 లక్షల రూపాయల చొప్పున జీతాలు ఇస్తే నెలకు రూ. 2.5 కోట్లు, ఏడాదికి రూ. 30 కోట్లు, ఐదేండ్లకు రూ. 150 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇందులో రూ. 75 కోట్లను ఇప్పటికే

చెల్లిస్తున్నారు. అదనంగా పడే భారం రూ. 75 కోట్లుగా నిర్ణయించారు. ఐదేళ్లలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆమోదించే బడ్జెట్‌లో ఇది 0.14 శాతం మాత్రమేనని ముఖ్యమంత్రి అన్నారు. మంత్రులకు కూడా జీతాలు రెట్టింపు చేసే విషయాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇచ్చే పెన్షన్ కూడా పెంచాలని నిర్ణయించారు. పార్లమెంట్ సభ్యులకు కూడా కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తున్న జీత భత్యాలు సరిపోవడం లేదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వమే వారికి అలవెన్సులు ఇచ్చే విషయాలని పరిశీలించాలని సూచించారు.

---------------------------------------------------

ముఖ్యమంత్రి కార్యాలయము

తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-4 17, నవంబరు, 2014

హుస్సేన్‌సాగర్ పరిధిలోని సంజీవయ్య పార్కులో ప్రపంచంలోనే అతిపెద్ద భవనాన్ని నిర్మించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ టవర్ల నిర్మాణానికి ఇప్పటికే నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి, ఇందుకు అనువైన స్థలాల విషయంలో అధికారులు ఇచ్చిన ప్రతిపాదనలను సోమవారం పరిశీలించారు. జిహెచ్ఎంసి కమీషనర్ సోమేశ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. సంజీవయ్య పార్కును యధాతథంగా కొనసాగిస్తూనే అందులోనే పెద్ద టవర్ నిర్మించాలని ముఖ్యమంత్రి వెల్లడించారు. పాటిగడ్డ, నర్సింగ్ కాలేజ్, దిల్‌కుష్ గెస్ట్‌హౌస్, రాఘవ టవర్స్ తదితర ప్రాంతాల్లో టవర్లు నిర్మిస్తామన్నారు.

---------------------------------------------------

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-5 17, నవంబరు, 2014

తెలంగాణలో లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూమి కోర్టు వివాదాల్లో ఉందని, వివాదాలు పరిష్కారం అయితే దాదాపు 3-4 లక్షల కోట్ల రూపాయల విలువైన భూములు అందుబాటులోకి వస్తాయని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు చెప్పారు. అంబర్ పేట బతుకమ్మ కుంట అన్యాక్రాంతం అయ్యిందని, దానిని కాపాడాలని ముఖ్యమంత్రికి రాజ్యసభ సభ్యుడు వి.హన్మంతరావు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నగర కమీషనర్ సోమేష్‌కుమార్, న్యాయ శాఖ కార్యదర్శి సంతోష్‌రెడ్డి, అడ్వకేట్ జనరల్ రామకృష్ణారెడ్డి, సహాయ అడ్వకేట్ జనరల్ రాంచందర్ రావు తదితరులతో ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు. బతుకమ్మ కుంట ఒకప్పుడు వ్యవసాయానికి ఉపయోగపడిందని, తరువాత అది అన్యాక్రాంతం అయ్యిందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ విషయంలో ఉన్న వివాదాన్ని త్వరలో పరిష్కరించుకొని ప్రభుత్వ ఆధీనంలోకి తేవాలని ముఖ్యమంత్రి సూచించారు. తెలంగాణలో నిజాంల నిర్ణయం వల్ల లక్షలాది ఎకరాల భూమి ప్రభుత్వ పరమైందని సిఎం చెప్పారు. అయితే పాలకుల నిర్లక్ష్యం, భూ బకాసురుల దుశ్చర్యల వల్ల ప్రభుత్వ భూమి కబ్జాలకు గురయ్యిందని ముఖ్యమంత్రి అన్నారు. చాలా భూములు కోర్టు వివాదాల్లో ఉన్నాయన్నారు. వివాదాలను త్వరగా పరిష్కరించడానికి ప్రభుత్వ న్యాయవాదులు కృషి చేయాలన్నారు.

---

ముఖ్యమంత్రి కార్యాలయము

తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన–6 17, నవంబరు, 2014

తెలంగాణలో గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. తెలంగాణలోని గోదావరి, కృష్ణా నదులు ఎక్కువ దూరం ప్రయాణం చేస్తాయని, కాని ఆంధ్ర పాలకులు ఆంధ్రలోనే ఘనంగా పుష్కరాలు జరిపే వారని ముఖ్యమంత్రి అన్నారు. పుష్కరాల విషయంలో తెలంగాణ పూర్తి నిర్లక్ష్యానికి గురయ్యిందన్నారు. పుష్కరుడు ఆవహించే గోదావరి తెలంగాణలోనే ఎక్కువగా ఉంటుంది కాబట్టి, గోదావరి నది ప్రవహించే అన్ని జిల్లాల్లో పుష్కరాల కోసం ఏర్పాట్లు చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం